క్లుప్తంగా

జ్వాలావీరభద్రస్వామికి విశేషపూజలు


జ్వాలావీరభద్రస్వామి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో లోకకల్యాణార్థమై బుధవారం సాయంత్రం ఆలయ ప్రాంగణంలోని జ్వాలావీరభద్ర స్వామికి విశేషపూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి అభిషేకం, విశేషపుష్పార్చన జరిపించారు.

శాస్త్రోక్తంగా నవగ్రహ దేవతా హోమములు


నవగ్రహ వాస్తు యోగిని దేవతా హోమాలను నిర్వహిస్తున్న పురోహితులు

పగిడ్యాల: ఆంజనేయస్వామి నూతన విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ వేడుకలను పురస్కరించుకుని బుధవారం మండలంలోని నెహ్రూనగర్ గ్రామంలో పురోహితులు శాస్త్రోక్తంగా సర్వతోభద్ర మండల నవగ్రహ వాస్తు యోగిని మంటప దేవత హోమములు జరిపించారు. అలాగే యంత్ర విగ్రహ అభిషేక కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రెండు రోజుల పాటు కొనసాగుతున్న పూజా కార్యక్రమాలకు పుణ్య దంపతులు పాల్గొని భక్తిని చాటుకున్నారు. గురువారం రాష్ట్ర శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి చేతుల మీదుగా విగ్రహ ప్రతిష్ఠాపన చేసేందుకు ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

గిరిజన మహిళలు చట్టాలను తెలుసుకోవాలి



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి తేజసాయి

ఆత్మకూరు: గిరిజన మహిళలు విద్యతో పాటు చట్టాలను కూడా తెలుసుకోవాల్సిన అవసరం ఉందని, ఆత్మకూరు జూనియర్ సివిల్ జడ్జి తేజ సాయి అన్నారు. పట్టణంలోని చక్రం హోటల్ సమీపంలో చెంచుగిరిజనులతో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గిరిజన మహిళలు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలన్నారు. అనంతరం మహిళలకు మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.కార్యక్రమంలో న్యాయవాదులు శ్రీధర్, రంగస్వామి, వెలుగు కో ఆర్డినేటర్ యుసుఫ్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి కంబాలపల్లి ఉరుసు


దర్గాలో ఫాతెహాలు నిర్వహిస్తున్న ముజావర్ బాదర్లసాహెబ్

పాములపాడు: మండలంలోని కంబాలపల్లి గ్రామంలో మస్తాన్‌వలి స్వామి ఉరుసు మహోత్సవ వేడుకలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. 9వ తేదీ గంధం మహోత్సవం, 10న ఉరుసు వేడుకలు జరుగనున్నాయి. స్వామి వారిని దర్శించుకున్న వారికి దీర్ఘ కాలిక వ్యాధులు నయమవుతాయని నమ్మకం. రెండు రోజుల పాటు గ్రామంలో ఉరుసు మహోత్సవం వేడుకలతో ఆధ్యాత్మిక వాతారవణం సంతరించుకుంటుంది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు వారు బందోబస్తు నిర్వహిస్తున్నారు.

ప్రతి పశువుకూ టీకా


టీకా వేస్తున్న పశువైద్యాధికారి డాక్టర్ భాస్కర్

పాములపాడు: నాలుగు నెలలు దాటిన ప్రతి పశువుకు గాలికుంటు వ్యాధి నివారణ టీకా వేయించాలని పశువైద్యాధికారి భాస్కర్ సూచించారు. బుధవారం మండలంలోని ఇస్కాల గ్రామంలో పశువులకు ఉచితంగా గాలి కుంటు నివారణ టీకాలు వేశారు. 100 ఎద్దులు, 140 గేదెలు, 70 దూడలకు టీకాలు వేసినట్లు డాక్టర్ తెలిపారు. ఈ వ్యాధి సోకితే జీవాల్లో తీవ్ర మైన జ్వరం, కొద్దిపాటి ఎండకు కూడా రొప్పడం, నీరసం, చూడి పశువులు ఈసుకుపోవడం, ఎద్దుల్లో పని సామర్థ్యం తగ్గుతుందని వివరించారు. ఎండాకాలం ఉదయం 10 గంటల్లోపు, సాయంత్రం పూట మాత్రమే పశువులను మేపాలని సూచించారు.

గ్రామీణ రహదారులకు మహర్దశ

- జీటీ రోడ్లకు నిధులు మంజూరు
- త్వరలో ప్రారంభం కానున్న పనులు
- సంతోషం వ్యక్తం చేస్తున్న ప్రజలు


ప్రస్తుతం గుంతలమయమైన పెంచికలపల్లి రహదారి

పాములపాడు: అభివృద్ధికి చిహ్నాలు రహదారులు, ప్రజల రాకపోకలు సాఫీగా సాగాలంటే రోడ్లు బాగుండాలి. టీడీపీ ప్రభుత్వం గ్రామీణ రహదారుల పట్ల నిర్లక్ష్య వైఖరి ప్రదర్శించడంతో సంవత్సరాల తరబడి గుంతల మయంగా ఉన్న రోడ్లతో పల్లెవాసులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి గ్రామాల అభివృద్ధికి బాటలు వేస్తోంది. ఈ క్రమంలో రహదారుల నిర్మాణాలకు నిధులు మంజూరు చేసింది. దీంతో తమ ఇక్కట్లు తప్పినట్టేనని గ్రామీణ ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఏఎంసీ నిధులు మంజూరు

నియోజకవర్గంలో బీటీ రహదారుల నిర్మాణ పనుల కోసం ప్రభుత్వం ఏఎంసీ (అగ్రికల్చర్ మెయింటెనెన్స్ కమిటీ) నిధులు మంజూరు చేసింది. ఇందులో పాములపాడు మండలానికి రూ.2.68 కోట్లు, నందికొట్కూరు మండలం కొణిదేల గ్రామం నుంచి పగిడ్యాల మండలం ముచ్చుమర్రి గ్రామం వరకు 4కిలో మీటర్ల మేర రూ.27 లక్షలు మరమ్మతులకు కేటాయించారు. బానుముక్కల నుంచి వేంపెంట గ్రామ పంచాయతీ మజరా సుంకులమ్మ కొట్టాల గ్రామం వరకు 6కిలో మీటర్ల మేర రూ.1.50 కోట్లు, చెలిమిల్ల గ్రామం నుంచి కొత్తపల్లి మండలం దుద్యాల గ్రామం వరకు 5 కిలో మీటర్లకు రూ.80లక్షలు, మద్దూరు గ్రామం నుంచి పెంచికలపల్లె గ్రామం వరకు 2 కిలో మీటర్లు రూ.38లక్షలతో బీటీ రహదారుల నిర్మాణాలు చేపట్టేందుకు నిధులు మంజూరయ్యాయి.

గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే దృష్టికి ..

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ పర్యటించి రహదారులను పరిశీలించారు. గ్రామస్తులు కూడా రహదారుల విషయం ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉండటంపై ఎమ్మెల్యే స్పందించారు. తప్పని సరిగా చర్యలు తీసుకుంటామని ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ మేరకు నిధులు మంజూరు చేయించి హామీ నెరవేర్చారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సత్ఫలితాలనిస్తోందని ప్రజల్లో ఆనందం వెల్లువిరుస్తోంది.

మాట నిలబెట్టుకున్నారు



మజరా గ్రామమైన పెంచికల పల్లికి రోడ్డు వేయడం ఆనందంగా ఉంది. ఎన్నో ఏళ్లగానో రోడ్డు వేయాలని కోరుతున్నాం. ఎవ్వరూ పట్టించుకోలేదు. ఇప్పుడు మా కల నెరవేరుతోంది. గుంతల మయంగా ఉన్న రోడ్డు గురించి ఎమ్మెల్యేకు చెప్పగానే స్పందించారు చాలా సంతోషంగా ఉంది. –లక్ష్మిదేవి, ఉప సర్పంచు, మద్దూరు

ఛిద్రమైన దారిలో నరకం చూస్తున్నాం



ఏ చిన్న పని పడినా ఆత్మకూరుకు వెళ్తాం. మా గ్రామంతో పాటు, లింగాల, ఇస్కాల, కొత్తపల్లి మండలంలోని నాగంపల్లి ప్రజలు చెలిమిల్ల మీదుగానే ఆత్మకూరుకు వెళ్లాల్సి ఉంది. దుద్యాల వరకు రోడ్డు అధ్వానంగా ఉంది. ఇప్పుడు ఈ రోడ్డుకు మరమ్మతులు చేయడంతో పాటు నూతనంగా తారు రోడ్డు నిర్మాణం చేపట్టడం చాలా ఆనందంగా ఉంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అంటే ప్రజల అవసరాలు తీరుస్తుందని నిజమవుతోంది. –గోపాల్, చెలిమిల్ల

త్వరలో పనులు ప్రారంభిస్తాం



టెండర్ ప్రక్రియ ముగిసింది. త్వరలో పనులు కూడా ప్రారంభించనున్నాం. ఇప్పటికే మెటీరియల్ కూడా తరలించడం జరిగింది. దాదాపు వారం రోజుల్లోనే పనులు ప్రారంభించి అతి వేగంగా కొనసాగేలా చర్యలు తీసుకుంటాం. త్వరలో ప్రజలు ఇబ్బందుల్లేకుండా ప్రయాణాలు చేయవచ్చు. –రాఘవేంద్ర ప్రసాద్, ఏఈ పంచాయతీరాజ్

బైక్ ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

శ్రీశైలంప్రాజెక్ట్: శిఖరేశ్వరం సమీపంలో బుధవారం రాత్రి జరిగిన బైక్ ప్రమాదంలో సున్నిపెంటకు చెందిన మల్లికార్జున, బయన్న గాయాలపాలయ్యారు. శిఖరేశ్వరానికి 2 కిమీ దూరంలో బయన్నసెలకు వెళ్లే ప్రాంతంలో ఓవర్‌స్పీడ్‌తో వస్తూ చెట్టును ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. గాయపడ్డవారిని శ్రీశైలం ప్రాజెక్ట్ ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందజేస్తున్నారు. మల్లికార్జునకు తీవ్ర గాయాలయ్యాయని మెరుగైన వైద్యం కోసం జిల్లా ఆసుపత్రికి రెఫర్ చేస్తున్నట్లు వైద్యులు తెలిపారు.

విస్తృతంగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

సాక్షి నెట్‌వర్క్ : పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి గెలుపుకోసం బుధవారం శ్రీశైలం, నందికొట్కూరు నియోజకవర్గాల్లో ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు విస్తృత ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ వెన్నపూస రవీంద్రారెడ్డికి ప్రథమ ప్రాధాన్యత ఓటువేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

ఇళ్ల స్థలాలు ఇవ్వండి

మహానంది: అబ్బీపురం గిరిజన కాలనీలో నివాసముంటున్న ఐదు కుటుంబాల వారికి ఇళ్లస్థలాలు మంజూరు చేయాలని సీపీఐ జిల్లా సమితి సభ్యులు సామేలు కోరారు. బుధవారం వారు మాట్లాడుతూ గత కొన్ని నెలల నుంచి కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా తహసీల్దార్ స్పందించడం లేదన్నారు. స్పందించని పక్షంలో జిల్లా కలెక్టర్, మానవహక్కుల కమిషన్, ఎస్టీ కమిషన్ పెద్దల దృష్టికి తీసుకెళ్తామన్నారు. మండల కార్యదర్శి వీరప్ప తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా తీర్థవారి చక్రస్నానం

- వైభవంగా ద్వాదశారాధనం
- కనుల పండువగా పుష్పయాగం


స్వామికి చక్రస్నానం చేయిస్తున్న ప్రధానార్చకులు

ఆళ్లగడ్డ: బ్రహ్మోత్సవ వేడుకల్లో చివరి రోజైన బుధవారం గ్రామోత్సవాలు, ఆధ్యాత్మిక ఘట్టాలు భక్తులను అలరించాయి. ఉత్సవాల ముగింపు సందర్భంగా దిగువ అహోబిలంలో ఉత్సవమూర్తులకు శాస్త్రోక్తంగా తీర్థవారి చక్రస్నానం నిర్వహించారు. ఉదయం ఉత్సవ మూర్తులు శ్రీదేవి భూదేవి సమేత శ్రీ ప్రహ్లాదవరదస్వాములను ప్రత్యేకంగా అలంకరించి కోనేరు వరకు ఊరేగింపుగా తోడ్కొని వచ్చారు. అక్కడ స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజల అనంతరం వస్త్రాలు మార్చి ప్రధానార్చకులు శ్రీమాన్ శఠకోప వేణుగోపాలన్ ఆధ్వర్యంలో సుదర్శన మూర్తి, నిత్య అభిషేక ఉత్సవమూర్తికి కోనేరులో శాస్త్రోక్తంగా తీర్థవారి చక్రస్నానం చేయించారు.

శాస్త్రోక్తంగా ద్వాదశ ఆరాధనం..

మధ్యాహ్నం ద్వాదశ ఆరాధనం పండితులు వేదమంత్రాలతో శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామికి ఆరాధన దోషాలను నివృతి చేసుకోవడం కోసం 12 మార్లు తిరువారాధన చేసి 12 రకాల భక్ష్యాలను 12 రకాల అన్నంతో నివేదించారు.

పూలు పరిమళించే..

రాత్రి ఉత్సమూర్తులను యాగశాలలో కొలువుంచి ముందుగా అభిషేకం, అర్చనలు నవకళశ స్నపన తిరుమంజనం జరి పించారు. అనంతరం విశేషాలంకరణ గావించి దేశంలోని వివిధ ప్రదేశాల నుంచి తెప్పించిన 108 రకాల పూలు, పత్రాలతో అలకంరించిన యాగశాలలో కొలువుంచారు. అనంతరం విడి పూలతో స్వామి, అమ్మవార్ల పాదాల నుంచి హృదయం మునిగేంత వరకు పుష్పారాధన గావించారు.


పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేస్తున్న మెప్మా సీఎంఎం శాంతకుమారి


స్థలం విరాళం ఇచ్చిన దంపతులను సన్మానిస్తున్న ఆర్యవైశ్య సంఘం సభ్యులు



దుద్యాల గ్రామస్తుల తరపున కొత్తపల్లి ఎంపీడీఓ మేరిని సత్కరిస్తున్న దృశ్యం


సీతామహాలక్ష్మమ్మను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

ఘనంగా మహిళా దినోత్సవం

నందికొట్కూరు: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని దామగట్ల గ్రామ సర్పంచు మాధవరం సుశీలమ్మ, మెప్మా సీఎంఎం శాంతకుమారి అన్నారు. బుధవారం మండల పరిధిలోని దామగట్లలో గ్రామ సర్పంచు మాధవరం సుశీలమ్మను ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఘనంగా సన్మానించారు. పట్టణంలో నీలిషికారిపేటలో మెప్మా ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. జైకిసాన్ పార్కులో మహిళలకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఆర్యవైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో వాసవి కన్యకా పరమేశ్వరీ దేవాలయంలో మహిళలందరూ క్షేమంగా ఉండాలంటూ అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. మెప్మా సీఎంఎంను, పొదుపు మహిళలకు దుశ్వాలువు కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం ఆటల పోటీ ల్లో గెలిచిన పొదుపు మహిళలకు బహుమతులు ప్రధానం చేశారు. ఆర్యవైశ్య దంపతులు భీమిశెట్టి తిమ్మయ్య, నాగరత్నమ్మ మహిళా దినోత్సవం సందర్భంగా రూ.5 లక్షల విలువ చేసే స్థలం కన్యకా పరమేశ్వరీ ఆలయానికి విరాళంగా అందజేశారు. ఆ దంపతులను ఆర్యవైశ్య సంఘం ఘనంగా సన్మానించారు.

మిడుతూరు: మహిళలు అన్ని రంగాలలో రాణించాలని గైనకాలజిస్టు డాక్టర్ సుగుణ అన్నారు. బుధవారం స్థానిక సామాజిక ఆరోగ్యకేంద్రంలో గర్భిణులకు స్కానింగ్ పరీక్షలు చేసిన అనంతరం మహిళాదినోత్సవ వేడుకలు నిర్వహించారు. గర్భిణులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్టాఫ్ నర్సు పుష్పలత, ముత్తు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

సమాజశ్రేయస్సులో స్త్రీల పాత్ర ముఖ్యమైనది

కొత్తపల్లి: మండలంలోని దుద్యాల గ్రామంలోని ఎస్సీ స్పెషల్ స్కూల్‌లో అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని మహిళలు ఎంపీడీఓ మేరిని దుశ్శాలువా, పూల మాలతో సత్కరించారు. కార్యక్రమంలో కేడీఎస్ఎస్ డైరెక్టర్ ఎస్.భాస్కర్, కేడీఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ దానమయ్య, ఎమ్మార్పీస్ జిల్లా నాయకులు రాజు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


విజయసూచిక చూపిస్తున్న ఆత్మకూరు ఆర్టీసీ డిపో మహిళా కండక్టర్లు

మహిళలకు సముచిత స్థానం కల్పించాలి

శ్రీశైలంప్రాజెక్ట్:అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బుధవారం సున్నిపెంటలోని భారతీయ స్టేట్‌బ్యాంక్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఏపీజెన్‌కో అకౌంట్స్‌ఆఫీసర్ బి.శారదను సన్మానించారు.బ్రాంచ్ మేనేజర్ కుబేర్‌గౌడ్ మాట్లాడు తూ మహిళలు అన్ని సందర్భాలలో అన్ని రంగాల్లోను సముచిత స్థానం ఇచ్చి గౌరవించాలన్నారు.

సరస్వతీ శిశు మందిర్‌లో మహిళా దినోత్సవ వేడుకలు

వెలుగోడు: పట్టణంలోని శ్రీ సరస్వతి శిశు మందిరం ప్రాథమిక పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో బుధవారం మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల పూర్వ విద్యార్థులు మారం రవికుమార్, ఆంజనేయులు, చెన్నకేశవుల శర్మ, (మధు పూజారి)ఇతర పూర్వ విద్యార్థులు పాఠశాల కమిటీ చైర్మన్, మాజీ మండల అధ్యక్షురాలు సీతా లక్ష్మమ్మ, శశికళను సన్మానించారు.

అన్ని రంగాల్లో మహిళలే ముందంజ

ఆత్మకూరు: మహిళలు అన్ని రంగాల్లోరాణిస్తూ పురుషులకు దీటుగా ముందుకు సాగుతున్నారని ఆత్మకూరు ఆర్టీసీ డిపో మేనేజర్ మహేంద్రుడు అన్నారు. పట్టణంలోని ఏపీఎస్ ఆర్‌టీసీ డిపో ఆవరణలో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ డిపోలో పనిచేస్తున్న మహిళా కండక్టర్లను సన్మానించారు. కార్యక్రమంలో మహిళా కండక్టర్లు సరస్వతి, ముర్తుజా, అంకమ్మ, సీఐ నాయక్, శ్రీనివాసులు, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.


దామగట్ల గ్రామంలో సర్పంచు మాధవరం సుశీలమ్మను పూలతో సన్మానిస్తున్న విద్యార్థులు

గిరిజన మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి

ఆవనినుంచి అంతరిక్షం వరకు మహిళలు ఎదుగుతూ విద్యాపరంగా, ఆర్థిక, సామాజిక, రాజకీయాల్లో రాణించాలని గిరిజన సంక్షేమ సంఘం నాయకులు జవహర్‌నాయక్, రఫిక్, శీలం శేషు అన్నారు. పట్టణంలోని మండలంలోని అమలాపురం చెంచుగూడెంలో మహిళలకు స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు.

దేశాభివృద్ధిలో మహిళల భాగస్వామ్యం కీలకం

మహానంది: దేశాభివృద్ధిలో మహిళల భాగస్వామ్యం ఎంతో కీలకమని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ కెఎస్ఎస్ నాయక్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కళాశాలలో బుధవారం పలు కార్యక్రమాలు నిర్వహించారు. వివిధ సాంస్కృతిక ప్రదర్శనల్లో ప్రతిభ చూపిన విద్యార్థినులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో కళాశాల మహిళా భద్రతా విభాగం చైర్మన్ డాక్టర్ బి.సరోజినీదేవి, సభ్యులు మాట్లాడారు.

వైభవంగా వేణుగోపాలస్వామి విగ్రహ ప్రతిష్ఠ


పారుమంచాలలో నూతనంగా నిర్మించిన వేణుగోపాలస్వామి ఆలయం

జూపాడుబంగ్లా: మండలంలోని పారుమంచాల గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో వేణుగోపాలస్వామి వారి విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు బుధవారం వైభవంగా నిర్వహించారు. తిరుమల–తిరుపతి ఆలయ అర్చకులు అగ్నిప్రణయనం, కుంభారాధన, విశేషోక్తహోమాలు నిర్వహించి పూర్ణాహుతి ఇచ్చారు. గర్భగుడిలో ప్రతిష్ఠించిన వేణుగోపాలస్వామివారి విగ్రహానికి అర్చకులు వేదమంత్రాల మధ్య ప్రాణ ప్రతిష్ఠచేశారు. అనంతరం మహాసంప్రోక్షణ, మహానివేదనం, అక్షతారోహణం, బ్రహ్మఘోష, మహదాశీర్వాదం, సర్వదర్శనం తదితర కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. భక్తులు స్వామివారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.


గర్భగుడిలో ప్రతిష్ఠించిన వేణుగోపాలస్వామి విగ్రహం

అంకితభావంతో పనిచేయాలి

నంద్యాల(అర్బన్): క్రమశిక్షణ, అంకితభావంతో పనిచేస్తే పదవులు అవే వస్తాయని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్‌రెడ్డి అన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లా వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జోనల్ ఇన్‌చార్జ్‌గా నియమించిన సందర్భంగా సన్నల సాయిరాంరెడ్డి ఎమ్మెల్యే శిల్పా రవి, మాజీ మంత్రి శిల్పామోహన్‌రెడ్డిని బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలిపారు. సాయిరాం రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఉమ్మడి జిల్లా విద్యార్థి విభాగాన్ని అప్పగించిన జిల్లా మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, ఎమ్మెల్యేలు శిల్పా రవి, కాటసాని రాంభూపాల్ రెడ్డి, బీవై రామయ్యకు కృతజ్ఞతలు తెలిపారు.

10న జాబ్‌మేళా

గూడూరు రూరల్: నిరుద్యోగ సమస్యను ఎదుర్కొంటున్న యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఈ నెల 10న మెగా జాబ్ మేళాను నిర్వహించనున్నట్లు ఎంపీఈఆర్ డైరెక్టర్ ఆదిమూలపు సతీష్ పేర్కొన్నారు. మండల పరిధిలోని గుడిపాడులో బుధవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 10న కర్నూలులోని జొహరాపురం రోడ్డు ఏ క్యాంపు నందు మదర్ థెరిసా ఫార్మసీ ఎడ్యుకేషన్ కాలేజీలో నిరుద్యోగ అభ్యర్థులకు ఇంటర్వ్యూలను నిర్వహించనున్నామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ఉన్నత చదువులు చదివిన నిరుద్యోగులను కలుసుకుని జాబ్‌మేళాపై అవగాహన కల్పించడం జరిగిందన్నారు. ఆసక్తి కలిగిన నిరుద్యోగులు ఇంటర్వ్యూలకు హాజరై ఉపాధి అవకాశాలను పొందాలని ఆయన తెలిపారు.

పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలి


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రాజమోహన్‌రెడ్డి

ఆత్మకూరు: నల్లమల అటవీ పరిధిలోని వివిధ గ్రామాల్లో అడవి పందుల దాడిలో పంటలు దెబ్బతిన్న రైతులను ఆదుకోవాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రాజమోహన్‌రెడ్డి కోరారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం మన ఊరు–మన పొలం చర్చావేదిక కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆత్మకూరు మండలంలోని వివిధ గ్రామాల్లో రైతులు పంటలు సాగు చేస్తే అటవి పందులు పెద్ద ఎత్తున గుంపులుగా చేరి పైర్లను ధ్వంసం చేస్తున్నాయని తెలిపారు. పంటలకు ఫారెస్ట్ అధికారులు తక్కువ స్థాయిలో నష్టపరిహారం చెల్లిస్తున్నారని చెప్పారు. పంట నష్టపరిహారం పెంచాలని డిమాండ్ చేశారు. ప్రజా సంఘాల నాయకుడు శీలం శేషు మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో పంటలకు అడవి పందుల నుంచి రక్షణ కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎర్రమఠం సర్పంచ్ బాల ఎల్లయ్య, దళిత నాయకులు లింగమూర్తి, సుధాకర్, స్వామిదాస్, హరిదాస్, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

పారిశ్రామిక విప్లవానికి నాంది


మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి

నంద్యాల: విశాఖపట్నంలో జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ కార్యక్రమానికి దేశంలోనే దిగ్గజ పారిశ్రామిక వేత్తలను రప్పించి లక్షల కోట్ల రూపాయల పెట్టుబడుల ఒప్పందం కుదిర్చి పారిశ్రామిక విప్లవానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాంది పలికారని, ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని శిల్పా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రూ.13లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి తెప్పించి ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తున్నారని చెప్పారు. చంద్రబాబు హయాంలో రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకొస్తానని, ఊకదంపుడు ప్రసంగాలు చేసి చివరకు రూ.39 వేల కోట్లు ఒప్పందాలు జరిగాయని చెప్పి అందులో సగం కూడా తీసుకు రాలేకపోయారన్నారు. ఉద్యోగులకు ఇవ్వాల్సిన అన్ని రకాల బకాయిలను నెలాఖరు లోపు చెల్లించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. నాయకులు శిల్పా భువనేశ్వరరెడ్డి, మహానంది దేవస్థానం చైర్మన్ మహేశ్వరరెడ్డి, మాజీ ఎంపీపీ నాగభూపాల్‌రెడ్డి, పార్టీ బండిఆత్మకూరు మండల కన్వీనర్ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

విరిగిన స్తంభం.. తప్పిన ప్రమాదం

మహానంది: గాజులపల్లె–గిద్దలూరు నల్లమల ఘాట్ రోడ్డులోని గాజులపల్లె సమీపంలో ఉన్న ఓ హోటల్ వద్ద విద్యుత్‌తీగలకు లారీ తగలడంతో విద్యుత్ స్తంభం విరిగి ఒరిగింది. అదృష్టవశాత్తు ఎవరికి ఎలాంటి ప్రమాదం లేకపోవడంతో బుధవారం స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు. కర్రల లోడుతో వెళ్తున్న లారీ కిందకు వేలాడుతున్న తీగలను తగిలింది. దీంతో స్థంభం విరిగి ఒరిగిపడింది. తీగలు తెగడంతో సుమారు నాలుగు గంటల పాటు విద్యుత్ సరఫరా అంతరాయం ఏర్పడింది. అధికారులు స్పందించి నూతన విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేయడంతో పాటు తీగల ఎత్తును పెంచాలని ప్రజలు కోరుతున్నారు.


విరిగి ఒరిగిన విద్యుత్ స్తంభం